కొడుకు అప్పు తీర్చలేదని తల్లి కిడ్నాప్

- 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు
- మహారాష్ట్రలో ఇద్దరు కిడ్నాపర్ల అరెస్ట్ వృద్ధురాలు సురక్షితం
- రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం కొడిముంజలో ఘటన

వేములవాడ రూరల్, నవంబర్ 7: కొడుకు డబ్బులు చెల్లించడం లేదని తల్లిని కిడ్నాప్ చేసిన కథ సుఖాంతమైంది. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో సీఐ వీరప్రసాద్ వివరాలు వెల్లడించారు. చెరుకు పంట కోసే విషయంలో వేములవాడ మండలం కొడుముంజ గ్రామానికి చెందిన అన్నదమ్ములు పల్లపు శ్రీనివాస్, వెంకటేశ్‌కు మహారాష్ట్రకు చెందిన లాలు నాగోరావ్ దయారంగలోడ్ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ మేరకు లాలు నాగోరావ్ దయారంగలోడ్ వద్ద రూ.3.80 లక్షలు తీసుకున్న శ్రీనివాస్.. చెరుకు కోసేందుకు కూలీలను పంపకపోవడంతో కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. కూలీల కోసం ఇచ్చిన డబ్బులను శ్రీనివాస్ చెల్లించకపోవడంతో బుధవారం నాగోరావ్ దయారంగ్‌లోడ్ అతని భార్య పంచతుల, మరో నలుగురు వ్యక్తులు వేములవాడ మండలం కొడుముంజకు చేరుకున్నారు. ఇంటి వద్ద శ్రీనివాస్ లేకపోవడంతో అతని తల్లి భీమాబాయిని కిడ్నాప్ చేసి మహారాష్ట్రలోని నాందేడ్‌కు తీసుకెళ్లారు. భీమాబాయి మనువడు వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు రెండు బృందాలు మహారాష్ట్రలోని నాందేడ్‌కు వెళ్లి భీమాబాయిని కిడ్నాప్ చేసిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని, త్వరలోనే వారిని పట్టుకుంటామని సీఐ వెల్లడించారు.

డబ్బుల విషయంలో వృద్ధురాలిని కిడ్నాప్ చేసిన ఇద్దరి అరెస్టును చూపుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్

15నుంచి సాగునీటిని విడుదల చేయండి

ఏపీ సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 7(నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3వ జోన్‌కు సాగునీటిని విడుదల చేయాలని ఏపీ సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎర్రమంజిల్‌లోని జలసౌధలో కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్ జైన్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణారావు మాట్లాడుతూ ప్రస్తుతం నాగార్జున సాగర్‌లో 301 టీఎంసీల పూర్తి సామర్థ్యంతో లక్షా 59వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసే స్థితిలో ఉన్నదని తెలిపారు. ఎడమ కాలువ 2, 3 జోన్లకు సంబంధించి 3.62 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 132 టీఎంసీల కేటాయింపు ఉన్నదని, అందులో ఏపీకి 32.25 టీఎంసీల వాటా ఉన్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం 3వ జోన్లోని 2.11లక్షల ఆయకట్టు రైతులు ఆరుతడి పంటలు సాగుచేశారని, దానికి ఈ నెల 15 నుంచి సాగునీటిని విడుదల చేయాల్సిన అవసరమున్నదని పేర్కొన్నారు. అదేవిధంగా కేఆర్ఎంబీ ప్రధాన కార్యాలయాన్ని విజయవాడకు తరలించాలని కోరారు. ఆయా అంశాలపై కేఆర్ఎంబీ సానుకూలంగా స్పందించినట్టు గోపాలకృష్ణారావు తెలిపారు. ఆయన వెంట యనమద్ది పుల్లయ్య చౌదరి తదితరులు ఉన్నారు.

మళ్లీ మెయిన్స్ రాయలేం

- కోర్టుకేసులతో ఆందోళనతో ఉన్నాం
- గ్రూప్ 1 అభ్యర్థుల మొర

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): కోర్టులో ఉన్న కేసుల కారణంగా టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాసిన అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఆయా కేసుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు వస్తే మెయిన్స్ పరీక్షలను మరోసారి నిర్వహిస్తారన్న ప్రచారం జరుగుతున్నది. మరోసారి మెయిన్స్ రాసే ఓపిక లేదని, మళ్లీ పరీక్ష జరపకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతూ పలువురు అభ్యర్థులు కమిషన్ చైర్మన్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. దాదాపు మూడేండ్లపాటు కష్టపడి చివరికి గత నెలలో మెయిన్స్ పరీక్ష రాశామని పేర్కొన్నారు. ఈ సమయంలో తమ విలువైన కాలాన్ని వెచ్చించామని, ఇప్పుడు జీవనోపాధిపై దృష్టి పెట్టామని తెలిపారు. ఇలాంటి సమయంలో మరోసారి పరీక్ష రాయాలంటే తమ వల్ల కాదని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైతే తీర్పు తర్వాత మెయిన్స్‌కు అర్హత సాధించే వారికి మాత్రమే ప్రత్యేకంగా పరీక్ష పెట్టాలని, నార్మలైజేషన్ వంటి ప్రక్రియ ద్వారా అందరికీ న్యాయం చేయాలని కోరారు.

గ్రూప్-4లో బ్యాక్‌లాగ్ పెట్టొద్దు

ప్రభుత్వానికి అభ్యర్థుల వినతి

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-4 ఉద్యోగాల భర్తీలో బ్యాక్‌లాగ్ పెట్టొద్దని అభ్యర్థులు కోరుతున్నారు. 1:3 ప్రకారం సెలెక్ట్ అయిన వారికి అన్‌విల్లింగ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇ టీవల గురుకుల పోస్టుల భర్తీలో ఎదురైన ఇబ్బందులను పరిగణలోకి తీసుకోవాలని విన్నవిస్తున్నారు. 2500 పోస్టులు బ్యాక్‌లాగ్ కావడంతో ఇప్పటికీ ఆందోళన చేస్తున్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు. జీవో 46 రద్దు విషయంలోనూ ప్రభుత్వం మాట తప్పిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స ర్కారు మొండి వైఖరి వీడాలని, అవసరమైతే అభ్యర్థులతో చర్చించాలని కోరుతున్నారు. లేకుంటే గురుకుల అభ్యర్థుల తరహాలో పెద్దఎత్తున ఆం దోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

అభ్యర్థులను అడ్డుకున్న పోలీసులు..

గ్రూప్-4 ఉద్యోగాల భర్తీపై డిప్యూటీ సీఎం భట్టిని కలిసేందుకు వచ్చిన అభ్యర్థులకు తీవ్ర నిరాశ ఎదురైంది. అశోక్‌నగర్‌లో ఓ అకాడమీ ప్రారంభోత్సవానికి హాజరైన ఆయనను కలిసేందుకు వెళ్లిన నిరుద్యోగులను పోలీసులు అడ్డుకున్నారు.

9 మంది డీ ఎస్పీల బదిలీ

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్బీ), సబ్ డివిజనల్ పోలీసు ఆఫీసర్ (ఎస్డీపీవో) విభాగాల్లోనే ఈ బదిలీలన్నీ జరిగాయి. ఈమేరకు ఆయా మల్టీజోన్ల ఐజీలు, సీపీలు, జిల్లా ఎస్పీలకు డీజీపీ కాపీలు పంపారు. ఈ బదిలీ ఆదేశాలు తక్షణం అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పీఆర్సీ వేసి ఫిట్‌మెంట్ ప్రకటించాలి

- జాక్టో చైర్మన్ సదానందం

హైదరాబాద్, నవంబర్ 7(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం వెంటనే పీఆర్సీ వేసి ఫిట్‌మెంట్ ప్రకటించాలని జాక్టో(జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్) డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్ కాచిగూడలోని ఎస్టీయూ భవన్‌లో జాక్టో చైర్మన్ సదానందంగౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సదానందంగౌడ్ మాట్లాడుతూ..ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. 317 జీవోపై క్యాబినెట్ నిర్ణయాన్ని అమలు చేయాలని, మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తిచేశారు. అన్ని మేనేజ్‌మెంట్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఈఎస్‌హెచ్ సౌకర్యం కల్పించాలని, కేజీబీవీ, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు కనీస వేతన సవరణ చట్టం అమలుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జాక్టో జనరల్ సెక్రటరీ కే కృష్ణుడు, ట్రెజరర్ జీ హేమచంద్రుడు పాల్గొన్నారు.

'మేఘా, రాఘవ' పై విచారణ జరపాలి

- ఆ రెండు సంస్థలు రూ.వేల కోట్లు కొల్లగొడుతున్నయ్
- కొడంగల్, మల్లన్నసాగర్ ఎత్తిపోతల్లో భారీ అక్రమాలు
- ఈడీకి కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ ఫిర్యాదు

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): మేఘా ఇంజినీరింగ్ ఇండియా లిమిటెడ్, రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థలు చేపట్టిన ప్రాజెక్టులపై సమగ్ర విచారణ జరపాలని కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన గురువారం హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో ఈడీ విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేశారు. కొడంగల్-నారాయణపేట లిఫ్ట్ స్కీం, మూసీ పునరుజ్జీవం కింద చేపట్టే మల్లన్నసాగర్ ఎత్తిపోతల్లో భారీ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, వేల కోట్ల రూపాయలను దండుకుంటున్నారని, ప్రభుత్వ పెద్దల కుటుంబాల కంపెనీలే ఈ అక్రమాల్లో కీలకమని ఆరోపించారు. రూ.4,350 కోట్లతో చేపడుతున్న కొడంగల్-నారాయణపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను ఎంఈఐఎల్ (మేఘా సంస్థ)కు ఇచ్చారని, మూసీ పునరుజ్జీవం కింద రూ.5,560 కోట్లతో మల్లన్నసాగర్ నుంచి మూసీ నదికి నీటిని ఎత్తిపోసే పథకాన్ని రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు ఇచ్చారని, వీటి ద్వారా భారీగా అక్రమలు జరుగుతున్నాయని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

పొంగులేటి బంధుప్రీతి

మూసీ నది పునరుద్ధరణ కోసం మల్లన్న సాగర్ నుంచి మూసీ నదికి నీటిని ఎత్తిపోసే టెండర్‌ను మంత్రి పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అప్పగించారని జడ్సన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది అత్యున్నత స్థాయి బంధుప్రీతి తప్ప మరొకటి కాదని, పారదర్శక పద్ధతిలో టెండర్లను కేటాయించనందుకు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ మార్గదర్శకాలను పూర్తిగా ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. కొడంగల్-నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కోసం మరో టెండర్‌ను మేఘా ఇంజినీరింగ్ ఇండియా లిమిటెడ్‌కి అప్పగించారని చెప్పారు. ఆగస్టులో సుంకిశాల ప్రాజెక్ట్ గోడ కూలిపోవడంపై శాఖాపరమైన విచారణలో ఎంఈఐఎల్ నేరపూరిత నిర్లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ధారించారని, ఆ కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో ఉంచాలని డిమాండ్ చేశారు.

పొంగులేటి ద్వారా భారీ కుంభకోణం

ప్రభుత్వంలో ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన రాష్ట్రవ కన్‌స్ట్రక్షన్‌కు నీటిపారుదల కాంట్రాక్టులను ఇవ్వడంలో భారీ కుంభకోణం జరుగుతుందని బక్క జడ్సన్ ఆరోపించారు. ఈ పథకం ద్వారా భారీగా డబ్బులు పొందేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పకడ్బందీగా ప్రణాళికలు రచిస్తున్నారని ఫిర్యాదు చేశారు. మంత్రి పొంగులేటి బంధువర్గంలో అనుమానాస్పదంగా ఉన్న కంపెనీలకు నీటిపారుదల టెండర్లను గుట్టుగా ఇస్తున్నారని ఈడీ దృష్టికి తీసుకెళ్లారు.

ఆదాయం 'తిరోగమనం'

- ఆందోళనకరంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు
- ఆదాయాన్నిచ్చే శాఖల్లో కనిపించని వృద్ధి
- కమర్షియల్ ట్యాక్స్ మినహా మిగతా శాఖల్లో మైనస్

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): పదేండ్లుగా ఏటికేడు గణనీయ వృద్ధితో దూసుకుపోతున్న రాష్ట్ర ఆర్థిక రంగానికి బ్రేకులు పడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల ఫలితంగా రాష్ట్ర ఆదాయ వృద్ధి తిరోగమన దిశగా సాగుతున్నది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు వచ్చిన ఆదాయ గణాంకాలను పరిశీలిస్తే.. కమర్షియల్ ట్యాక్స్ మినహా మిగతా శాఖల్లో నెగిటివ్ వృద్ధి రేటు నమోదైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బుధవారం నిర్వహించిన సమావేశంలో ఉన్నతాధికారులు ఈ విషయాన్ని స్పష్టంచేశారు. రాష్ట్ర పరిస్థితిని గణాంకాలతో సహా వివరించారు.

కమర్షియల్ ట్యాక్స్‌లో మాత్రమే..

రాష్ట్రానికి కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, మైనింగ్, వెహికల్ ట్యాక్స్ విభాగాల ద్వారా ప్రధానంగా ఆదాయం వస్తుంది. గత ఏడు నెలల్లో ఒక్క కమర్షియల్ ట్యాక్స్ మినహా .. మిగతా అన్ని విభాగాల్లో నెగిటివ్ వృద్ధి నమోదైంది. వాస్తవానికి గత ఆర్థిక సంవత్సరం వరకు రాష్ట్రంలో ఉన్న పరిస్థితులతో పోల్చితే.. ఆదాయాన్నిచ్చే శాఖలు ఈ ఏడాది కనీసం 8-10% వృద్ధితో దూసుకుపోవాల్సి ఉన్నది. కానీ, మైనింగ్, వెహికల్ ట్యాక్స్, ఎక్సైజ్ శాఖలో సగటున 2% లోటు నమోదైంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో 1% లోటు నమోదైంది. కమర్షియల్ ట్యాక్స్ విభాగంలో మాత్రమే 7.5% వృద్ధి కనిపించింది. అయితే ఇది సహజంగా పెరిగింది కాదని.. పారిశ్రామిక బకాయిలు, ఇతర పెండింగ్ అంశాలకు సంబంధించి ప్రభుత్వం వన్ టైం సెటిల్మెంట్లు ఇతర మార్గాల్లో ప్రయత్నించడంతో ఇది సాధ్యమైనట్టు చెప్తున్నారు.

ఇలాగే ఉంటే కష్టమే

పరిస్థితి ఇలాగే కొనసాగితే రాను రాను ప్రభుత్వానికి కష్టమవుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం ఆదాయం సృష్టించడంపై దృష్టి పెట్టకుండా కేవలం రాజకీయ హడావుడి చేస్తుండటం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని చెప్తున్నారు.

రోజుకు రూ.5 కోట్ల లూటీ!

- రాష్ట్రంపై సైబర్ నేరగాళ్ల అటాక్
- 10 నెలల్లో 3,500 డిజిటల్ అరెస్టు కేసులు నమోదు
- తెలంగాణలోనే రూ.237కోట్ల దోపిడీ
- బాధితుల్లో 60శాతం వృద్ధులే..
- డిజిటల్ అరెస్టులపై ఆలస్యంగా ప్రచారం

> రాష్ట్రంపై సైబర్ నేరగాళ్ల దండయాత్ర కొనసాగుతున్నది. అమాయక ప్రజలను ఆన్‌లైన్ దొంగలు లూటీ చేస్తున్నారు. కేసుల పేరిట భయపెడుతూ లక్షల్లో దండుకుంటున్నారు. తెలంగాణలో సైబర్‌మోసగాళ్లు రోజుకు సుమారు రూ.5కోట్ల వరకు దోపిడీకి పాల్పడుతున్నట్టు సమాచారం.

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): రోజుకురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. దీనిపై పౌరులకు అవగాహన కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతున్నది. ఏదో ఒక రూపంలో, కొత్త ఎత్తుగడలతో సైబర్ నేరగాళ్లు రోజుకు కనీసం రూ.5కోట్ల వరకు రాష్ట్రం నుంచి కొల్లగొడుతున్నారు. మోసపోయామని 1930కి లేదా పోలీసులకు బాధితులు చెబితేనే రోజుకు రూ.5కోట్ల దోపిడీ వెలుగులోకి వస్తున్నది. ఇంకా సైబర్ మోసగాళ్ల మాయలోనే ఉండి, వారు చెప్పిందే నిజమనుకొనే వారు ఎందరో? అనేది ఆందోళన కలిగించే అంశం. ప్రధానంగా 'డిజిటల్ అరెస్టు' పేరిట ఒక్కొక్కరి నుంచి లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. ఈ డిజిటల్ అరెస్టుల్లో అత్యధిక శాతం వృద్ధులే ఉండటం విస్తుపోయే అంశం. తెలంగాణలో ఈ ఏడాది 10 నెలల్లో 3,500 డిజిటల్ అరెస్టులు జరగగా.. వాటి ద్వారా సుమారు రూ.240కోట్ల వరకు కొల్లగొట్టారు. పది నెలల్లోనే 3,238 మోసాలు జరగగా.. బాధితులు వేలల్లో ఉన్నారు. 3,500 కేసుల్లో బాధితుల్లో 60శాతం వరకు వృద్ధులు ఉన్నారని సైబర్ సెక్యూరిటీ బ్యూరో వర్గాలు తెలిపాయి.

ట్రై కమిషనరేట్లలోనే అధికం

పోలీసుల అవతారంలో వాట్సాప్ కాల్ చేసి మీ కొడుకు/కూతురు లేదా మనువళ్లు, మనవరాళ్లు డ్రగ్స్, మనీ ల్యాండరింగ్ కేసుల్లో ఇరుక్కున్నారంటూ దొంగ ఎఫ్ఐఆర్‌లు చూపించి.. బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ తరహా కేసులు రాజధానిలోని ట్రై కమిషనరేట్ల పరిధిలో అందులోనూ ఉద్యోగస్తులు అధికంగా ఉండే సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎక్కువగా నమోదుతున్నాయి. పది నెలల్లో ఈ మూడు కమిషనరేట్లు కలిపి 1140 కేసుల్లో రూ.121.31 కోట్లను బాధితులు మోసపోయారు. రాష్ట్రవ్యాప్తంగా రోజుకు సైబర్ నేరగాళ్ల బాధితుల నుంచి 1200 కాల్స్ వస్తున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

జీపీఎఫ్ వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచాలి : పీఆర్టీయూ

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయుల జీపీఎఫ్ వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పంచాయతీరాజ్ సెక్రటరీని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా కలిసి వినతిపత్రం అందజేశారు. రిటైర్డ్ అయిన, కొత్త జిల్లాలకు బదిలీ అయిన టీచర్లకు జీపీఎఫ్ జమచేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో నిలువురాయిని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

'నిలువురాయిని' భవిష్యత్తు తరాలకు అందించాలి

పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

హైదరాబాద్, నవంబర్ 7(నమస్తేతెలంగాణ) : నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం కంసానిపల్లె శివారులో డిండి నది ఒడ్డున గల 3500 ఏండ్ల నాటి ప్రసిద్ధిగాంచిన నిలువురాయి కనుమరుగయ్యే ప్రమాదం ఉన్నదని పురావస్తు పరిశోధకుడు, ఫ్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో ఈమని శివనాగిరెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. పురావస్తు అన్వేషణలో భాగంగా గురువారం ఆయన ఇనుప యుగం నాటి ఈ రాయిని గుర్తించారు. ఈ సందర్భంగా దీని ప్రాశస్త్యాన్ని వివరిస్తూ.. ఇనుప యుగంలో ఓ ప్రముఖుడి స్మరణార్థం ఈ రాయిని ఏర్పాటుచేశారని, దీనిని మెన్హిర్ అంటారని తెలిపారు. 8 అడుగుల ఎత్తు, 2 అడుగుల వెడల్పు, అడుగున్నర మందం గల ఈ రాయిని కాపాడుకొని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని చెప్పారు. ఆయన వెంట తిప్పర్తి జగన్మోహన్‌రెడ్డి, అభిలాష్‌రెడ్డి, బడే సాయికిరణ్‌రెడ్డి ఉన్నారు.

వామ్మో.. పులి!

- ఉత్తర తెలంగాణ జిల్లాలను వణికిస్తున్న పులులు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెరిగిన సంచారం

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో పులుల సంచారం పెరిగింది. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పెరిగిన పులుల సంచారం అక్కడి అటవీ అధికారులు, ప్రజలకు నిద్రలేకుండాచేస్తున్నాయి. పది రోజుల నుంచి లక్షెట్టిపేట మండలం హన్మంతుపల్లి, హాజీపూర్ మండలం ధర్మారం బీట్ పరిధిలో పెద్దపులి సంచరిస్తుందని పాదముద్రల ఆధారంగా అటవీ శాఖ అధికారులు గుర్తించారు. హాజీపూర్‌మండలం బుగ్గగుట్ట అటవీ ప్రాంతంలో గత నెల 27న చిరుత పులి గొర్రె లమందపై దాడి చేసి రెండు గొర్రెలను చంపిందని అటవీశాఖ అధికారులు తెలిపారు. మేడారం సెక్షన్‌లో మేతకు వెళ్లిన ఆవులపై పెద్ద పులి దాడి చేసి చంపడం కలకలం రేపింది. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కుచలాపూర్‌లో అటవీశాఖ బిగించిన సీసీ కెమెరాల్లో చిరుత పులి దృశ్యాలు నమోదయ్యాయి. చిరుత సంచారంతో వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్నామని, అధికారులు రక్షణ కల్పించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కల్లు దుకాణాలపై వివరణ ఇవ్వండి

రాష్ట్రానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో చట్ట వ్యతిరేకంగా కల్లు అమ్మకాలు జరుగుతున్నాయంటూ దాఖలైన పిటిషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం తమ వాదనలను తెలియజేయాలని హైకోర్టు ఆదేశించింది. కల్లు విక్రయాలకు చర్యలు తీసుకోవడం లేదని రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన బాలరాజ్ దాఖలు చేసిన పి ల్ ను గురువారం హైకోర్టు విచారించింది. ఇదే తరహాలో మరో పిల్ కూడా విచారణలో ఉన్నదని అదనపు అడ్వొకేట్ జనరల్ మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్ గుర్తుచేశారు. రెండింటినీ కలిపి విచారణ చేపడతామన్న హైకోర్టు, ప్రతివాదులైన ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్, డిప్యూటీ కమిషనర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది.

మార్గదర్శి వివరాలు ఉండవల్లికి ఇవ్వండి

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): సుప్రీంకోర్టుకు మార్గదర్శి సమర్పించిన వివరాలు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు పెన్‌డ్రైవ్‌లో ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. గతంలో ఆదేశించిన మేరకు తె లంగాణ, ఏపీ రాష్ట్రాలు ఎందుకు కౌం టర్లు దాఖలు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేసింది. డిసెంబర్ 20 లోగా కౌంటర్లు వేయాలని రెండు రాష్ట్రాలతోపాటు ఆర్బీఐకి ఆదేశాలు జారీ చేసిం ది. విచారణను జనవరి 3కు వాయిదా వేస్తూ జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ నా మవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం తీర్పునిచ్చింది.

'ఇంటర్ క్వశ్చన్ బ్యాంక్' మిస్సింగ్?

- అధికారుల నిర్లక్ష్యమా? ఉద్దేశపూర్వకమా?
- ప్రశ్నావళి మాయంపై సోషల్ మీడియాలో చక్కర్లు
- పోలీసులకు ఫిర్యాదు చేయక పోవడంపై అనుమానాలు

హైదరాబాద్, నవంబర్ 7(నమస్తేతెలంగాణ): ఇంటర్‌బోర్డులో క్వశ్చన్ బ్యాంక్ మిస్సింగ్ అయిందనే వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇందుకు అధికారుల నిర్లక్ష్యం కారణమా? లేదంటే ఎవరైనా ఉద్దేశపూర్వకంగా మాయం చేశారా? అంటూ వాట్సాప్ గ్రూపుల్లో వైరలవడం కలకలం రేపుతున్నది. బోర్డు అధికారులు ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డట్టు తెలుస్తున్నది. ఈ పరిస్థితుల్లోనే పోలీసులకు ఫిర్యాదు చేయలేదని అనుమానాలు తలెత్తుతున్నవి.

క్వశ్చన్ బ్యాంకు ఆధారంగానే తయారీ

ఏటా మార్చిలో జరిగే ఇంటర్మీడియట్ పరీక్షల ప్రశ్నపత్రాల రూపకల్పనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఉండాలనే ఉద్దేశంతో ఐదేండ్ల క్రితం క్వశ్చన్ బ్యాంక్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు బోర్డు వర్గాల ద్వారా తెలిసింది. ఇందులో వ్యాసరూప, లఘు, ఇతర ప్రశ్నలకు ఒక్కో నంబర్ కేటాయిస్తారు. ఈ నంబర్ల సాయంతోనే క్రమపద్ధతిలో ప్రశ్నలను ఎంపిక చేస్తారు. సబ్జెక్ట్ నిపుణుల పరిశీలన అనంతరం తుది ప్రశ్నపత్రాన్ని విడుదల చేస్తారు.

తప్పులు దొర్లే అవకాశం..

క్వశ్చన్ బ్యాంక్ మిస్సింగ్ వార్తల నేపథ్యంలో ప్రశ్నపత్రాల తయారీ చర్చనీయాంశంగా మారింది. ప్రశ్నావళి లేకుంటే ప్రశ్నపత్రాల రూపకల్పనలో తప్పులు దొర్లే అవకాశం ఉంటుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదలైన మరుసటి రోజే పరీక్షల ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో బోర్డు కాన్ఫిడెన్షియల్ సిబ్బంది క్వశ్చన్ బ్యాంక్ మిస్సింగ్ విషయాన్ని గుర్తించినట్టు తెలిసింది. వారు వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేసినట్టు వినికిడి. ఈ విషయంలో బోర్డు అధికారులు గోప్యత పాటిస్తున్నారు. ఒకవేళ మిస్సైన క్వశ్చన్ బ్యాంక్ కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీలకు దొరికితే పరిస్థితి ఏంటని పలువురు విద్యావేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారి జయప్రదను వివరణ కోరగా.. ఇవన్నీ పుకార్లేనని కొట్టిపారేశారు. క్వశ్చన్ బ్యాంక్ మిస్సింగ్‌పై సమగ్ర విచారణ జరుపాలని, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఐఏఎస్ కాళీచరణ్‌పై డీవోపీటీకి ఫిర్యాదు

- నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపణలు
- చర్యలు తీసుకోవాలని కోరిన హైదరాబాద్‌వాసి

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఐఏఎస్ అధికారి, బయోడైవర్సిటీ బోర